
పళ్ళికరణైలోని కొన్ని వీధుల్లో వున్న వరదనీరు

తీరందాటిన వాయుగుండం

- ఊపిరి పీల్చుకున్న ప్రజానీకం
- యథావిధిగా తెరుచుకున్న విద్యాసంస్థలు

అడయార్, అక్టోబరు 17: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గురువారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో తీరందాటింది. పుదుచ్చేరి - ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల మధ్య చెన్నైకి ఉత్తరం దిశగా ప్రయాణించి తడ సమీపంలో తీరందాటింది. తీరం దాటే సమయంలో కూడా చెన్నైలో ఒక్క చుక్క వర్షం కురవకపోవడంతో నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ఈ నెల 20న ప్రారంభంకావడం సహజం. కానీ, ఈ యేడాది ఇవి ఈ నెల 16వ తేదీనే ప్రారంభమయ్యాయి. వీటికంటే ముందే ఈ నెల 14న బంగాళాఖాతంలో అల్పపీడనంతో పాటు వాయు గుండం ఏర్పడింది. దీంతో బుధవారం నగరంలో కుంభవృష్టి కురిసింది. చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్ళూరు జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఈ తుపాను 16వ తేదీకి మరింతగా బలపడి చెన్నై నగరానికి సమీపంలో తీరం దాటొచ్చని, అదేసమయంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తిరువళ్ళూరు జిల్లా చోళవరంలో ఒకే రోజున 30 సెంటీమీటర్ల వర్షపాతం, రెడ్‌హిల్స్‌లో 28, ఆవడి, మనలి ప్రాంతాల్లో 25 సెంమీ చొప్పున వర్షపాతం నమోదైంది. చెన్నై నగరంలోని అనేక ప్రాంతాల్లో 15 నుంచి 20 సెం.మీ మేరకు వర్షపాతం నమోదైంది. దీంతో చెన్నై నగరంలో రవాణాతో జనజీవనం స్తంభించిపోయింది. వాయుగుండం 16వ తేదీన తీరం దాటవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. అయితే, ఇది గురువారం తెల్లవారుజామున తీరం దాటింది. అదేసమయంలో తీరం దాటే సమయంలో భారీ వర్షం కురుస్తుందని వెల్లడించిన వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించి, కొన్ని గంటల్లోనే బుధవారం రాత్రే ఈ రెడ్‌అలెర్ట్‌ను ఉపసంహరించుకుంది.

ఇప్పటికీ వర్షపునీటిలోనే పలు ప్రాంతాలు

భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా ఉత్తర చెన్నైతో పాటు తిరువళ్ళూరు జిల్లాలోని పలు ప్రాంతాలు వరద నీటిలో ఉన్నాయి. రెడ్‌హిల్స్ ప్రాంతంలో మంగళవారం ఏకంగా 28 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో రెడ్‌హిల్స్, పడియనల్లూరు తదితర ప్రాంతాలు నీట మునిగాయి. పుళల్ పంచాయతీలోని పలు ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మాధవరం సమీపంలోని మంజాంబాక్కం, వడ పెరుంబాక్కం ప్రాంతంలోని అనేక గృహాల్లో వర్షపు నీరు నిలిచివుంది. ఆవడి కార్పొరేషన్ పరిధిలోని గుడిసె పునరావాస ప్రాంతాలు ఇప్పటికీ నీటిలోనే ఉన్నాయి. ఈ ప్రాంతాలవాసులను పునరావాస కేంద్రాలకు తరలించి, ఆహారం అందిస్తున్నారు. దక్షిణ చెన్నైలోని పళ్ళికరణి, దురైపాక్కం, మడిప్పాక్కం, మేడవాక్కం, తరమణి, ఎస్ఆర్‌పీ టూల్స్, షోళింగనల్లూరు వరకు అనేక లోతట్టు ప్రాంతాలు వర్షపునీటిలోనే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో జనావాస ప్రాంతాల్లో నిలిచివున్న నీటిని పారిశుద్ధ్య కార్మికులు మోటార్ల ద్వారా తొలగిస్తున్నారు.

కూలిన ఎనిమిది గుడిసెలు

పొన్నేరి, కాట్టూరు ప్రాంతాల్లో భారీ వర్షానికి ఎనిమిది గుడిసెలు కూలిపోయాయి. ఈ ప్రాంతంల్లో 150 నుంచి 200 ఎకరాల్లో పలు పంటలు నీటమునిగాయి. పొన్నేరి సమీపంలోని తడపెరుంబాక్కం ఏరియాలో ఏఏఎం నగర్, దురైస్వామి నగర్, కాలనీ ఏరియాల్లో వందకు పైగా ఇళ్ల నీటిలో ఉన్నాయి. దీంతో ఈ ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు. మీంజూరు, అత్తిపట్టు పుదునగర్ ప్రాంతాల్లో వర్షపునీరు ముంచెత్తింది. దీంతో ఈ ప్రాంత వాసులను అధికార యంత్రాంగం సమీపంలోని షెల్టర్లకు తరలించింది.


రెట్టేరి చెరువు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

సమష్టి కృషితో వర్షాలపై విజయం

ఎంతటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధం ● సీఎం స్టాలిన్ ధీమా

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షాల కారణంగా ఎదురయ్యే ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. కొళత్తూరులో వర్షబాధిత ప్రాంతాలు, చెరువు మరమ్మతు పనులు, పారిశుద్ధ్య కార్మికుల సహాయాల పంపిణీ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ మూడు రోజుల క్రితం కుండపోతగా కురిసిన వర్షాలకు జలదిగ్బంధంలో చిక్కుకున్న అన్ని ప్రాంతాల్లోనూ ప్రస్తుతం వాననీటి తొలగింపు పనులన్నీ పూర్తయ్యాయన్నారు. వర్షబాధిత ప్రాంతాల్లో 24 గంటలపాటు పారిశుద్ధ్య కార్మికులందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. గత మూడు రోజులుగా చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో తమ ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన సహాయ కార్యక్రమాలను చూసి సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారని, వాటిని చూసి ఓర్వలేనివారే ప్రస్తుతం పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నారంటూ పరోక్షంగా అన్నాడీఎంకేపై ధ్వజమెత్తారు. ఈశాన్య రుతుపవనాల ప్రారంభంలోనే ఇంతటి వర్షబీభత్సం ఎదురైనా అన్ని ప్రభుత్వ శాఖలూ కలిసి యుద్ధ ప్రాతిపదికన పనిచేసి సకాలంలో వర్షబాధిత ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టాయన్నారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావం రెండు నెలలపాటు కొనసాగుతుందని, ఆ లోగా ఎంతటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు.


బాలాజీ నగర్ వైద్యశిబిరంలో ప్రజలకు పాలు, గుడ్లు అందజేస్తున్న స్టాలిన్


కొళత్తూరు కామరాజర్ సత్రంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి బిర్యానీ రుచి చూస్తున్న స్టాలిన్

కొళత్తూరు ప్రాంతంలో సీఎం పరిశీలన

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన సొంత నియోజకవర్గం కొళత్తూరులోని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఉదయం పర్యటించారు. ఆ సందర్భంగా దివ్యాంగులకు, పారిశుద్ధ్య కార్మికులకు సహాయాలు అందజేశారు. 600 మంది పారిశుద్ధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన బిర్యానీ విందులో వారితో కలిసి ఆయన భుజించారు. గత రెండు రోజులుగా ఉత్తర చెన్నై, దక్షిణ చెన్నై వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ నేపథ్యంలో కొళత్తూరు నియోజకవర్గంలో ఆయన గురువారం పర్యటించి వాననీటి కాల్వలు, చెరువు మరమ్మతు పనులు, ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సహాయ కార్యక్రమాలను పరిశీలించారు. వర్షాకాలంలో జలదిగ్బంధంలో చిక్కుకునే కొళత్తూరు, వీనస్ కాలనీ, గణేష్‌నగర్, సెల్వినగర్, మహవీర్ నగర్ తదితర ప్రాంతాల్లో వాననీటిని తొలగించేందుకు రూ.1.40 కోట్లతో ఏర్పాటు చేసిన వాననీరు, మురుగునీరు తొలగింపుకేంద్రం పనితీరును ఆయన కలిసి పరిశీలించారు. ఆ తర్వాత రెట్టేరి చెరువు వద్ద నీటివనరుల శాఖ ఆధ్వర్యంలో రూ.44కోట్లతో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. అక్కడి నుంచి కుమరన్‌నగర్ రోడ్డులో ఉన్న బాలాజీ నగర్ వద్ద ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఈ శిబిరానికి వచ్చి వైద్యపరీక్షలు జరుపుకున్నవారికి రొట్టెలు, పాలు, గుడ్లు తదితరాలను స్టాలిన్ పంపిణీ చేశారు. ఆ తర్వాత అయనవరం, మాధవరం జోన్‌ల పరిధిలో తనికాచలం నగర్ వద్ద రూ.91.36 కోట్లతో చేపడుతున్న కాలువ విస్తరణ పనులను కూడా తనిఖీ చేశారు.

మెగా బిర్యానీ విందు...

కొళత్తూరు జంబులింగం మెయిన్‌రోడ్డులోని కామరాజర్ సత్రంలో సుమారు 600 మంది పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం, రెయిన్‌కోట్, వంట నూనె, సహా 10 నిత్యావసర వస్తువుల కిట్ స్టాలిన్ అందజేశారు. ఆ తర్వాత పారిశుద్ధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన మెగా బిర్యానీ విందును ప్రారంభించారు. కార్మికులతో పాటు స్టాలిన్ కూడా కూర్చుని, వారితో మాట్లాడుతూ బిర్యానీ రుచి చూశారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, ఎంపీలు డాక్టర్ కళానిధి వీరాసామి, గిరిరాజన్ ఎమ్మెల్యే ఎస్.సుదర్శనం, కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురుబరన్, మహానగర్ తాగునీటి సరఫరా మురుగునీటి తొలగింపు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ టీజీ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సహాయాలు..

పెరియార్‌నగర్, కార్తికేయన్‌రోడ్డులో ఉన్న తిరువళ్లువర్ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగుల కోసం సహాయాలు పంపిణీ చేశారు. పెరంబూరు, సెంబియం, రాఘవవీధిలోని సీఎస్ఐ ప్రత్యేక పాఠశాలలో చదువుతున్న 70 మంది దివ్యాంగ చిన్నారులకోసం, ఆ పాఠశాలకు రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్, రెండు బీరువాలు, నిత్యావసర వస్తువులు సహా మొత్తం రూ.2 లక్షల విలువైన వస్తువులను ఆ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎడ్విన్ రాజ్‌కుమార్‌కు అందజేశారు. అదే సమయంలో పాఠశాల అభివృద్ధి కోసం నగదు సాయం కూడా అందించారు.

ఘనంగా అన్నాడీఎంకే వ్యవస్థాపక దినోత్సవం

- పార్టీ పతాకాన్ని ఎగురవేసిన ఈపీఎస్


ఎంజీఆర్, జయ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఈపీఎస్, అన్నాడీఎంకే నేతలు

అడయార్, అక్టోబరు 17: అన్నాడీఎంకే 53వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలను పురస్కరించుకుని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాకి కె.పళనిస్వామి (ఈపీఎస్) పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎంజీఆర్, మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత కాంస్య విగ్రహాలకు నివాళులర్పించి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నేతలకు, కార్యకర్తలకు ఆయన మిఠాయిలు పంచిపెట్టి, సంబరాలు జరుపుకున్నారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయపేటలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయం పార్టీ నేతలు, కార్యకర్తలతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకేను వల్లే రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉందన్నారు. 30 యేళ్ళపాటు పార్టీ అధికారంలో ఉండటం రాష్ట్రానికి ఒక రక్షణ కవచంలా మారిందన్నారు. ఒక్క రోజు కురిసిన వర్షానికే చెన్నై జలదిగ్బంధంలో చిక్కుకుందని, ఇప్పటికీ అనేక ప్రాంతాలు వర్షపు నీటిలో ఉన్నాయన్నారు. కానీ, ఉపముఖ్యమంత్రి, మంత్రులు పదేపదే నగరంలో ఎక్కడా చుక్క నీరు లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత 2022లో చెన్నై నగరంలో 20 సెంటీమీటర్ల వర్షం కురిసినా ఒక్క చుక్క నీరు నిలవదని చెప్పారని ఈపీఎస్ గుర్తు చేశారు. 2023లో కూడా ఇదే పలుకులు పలికారన్నారు. కానీ, ఇపుడు కురిసిన వర్షం డీఎంకే పనితీరును బట్టబయలు చేసిందన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలోనే 2400 కిలోమీటర్ల మేర డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి శ్రీకారం చుట్టి 1840 కిలోమీటర్ల మేర పనులను పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులకు 40 నెలలుగా కొనసాగిస్తూనే ఉన్నారన్నాని విమర్శించారు. నగరంలో వర్ష ముంపు బాధిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై నివేదిక రూపొందించామని, దాని ప్రకారం ఆయా ప్రాంతాల్లో తీసుకున్న చర్యలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని తమ పార్టీ డిమాండ్ చేసిందన్నారు. దీనికి డిప్యూటీ సీఎం ఉదయనిధి రోడ్లపై చుక్కనీరు నిలబడలేదని, అదే శ్వేతపత్రమంటూ వ్యాఖ్యానించడం ఆయన అపరిపక్వతనానికి నిదర్శనమన్నారు. సీఎం స్టాలిన్‌కు ప్రజలపై ఎలాంటి ప్రేమ లేదని, కేవలం ఆయన కుటుంబ సభ్యులపైనే అపారమైన ప్రేమతో ఉన్నారన్నారు. వరద బాధిత ప్రాంతాల్లో కుంటి సాకులు చెప్పకుండా సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఎడప్పాడి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


కార్యాలయానికి తరలివచ్చిన అన్నాడీఎంకే నేతలు, కార్యకర్తలు

వైభవంగా బంగారు అడిగళార్ విగ్రహ ప్రతిష్ఠ


అడిగళార్ పాదముద్రల పీఠాన్ని పరిశీలిస్తున్న ఉత్సవ నిర్వాహకులు


అడిగళార్ విగ్రహానికి హారతి ఇస్తున్న లక్ష్మీ బంగారు అడిగళార్

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి సిద్ధ పీఠంలో గురువారం ఉదయం ఆధ్యాత్మిక గురువు, దివంగత బంగారు అడిగళార్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గురుపీఠంలో విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన కార్యక్రమాలు బుధవారం ఉదయం గురుపీఠంలో మంగళవాయిద్యాలతో ప్రారంభమయ్యాయి. ఆ సందర్భంగా గర్భాలయంలోని ఆదిపరాశక్తికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని సిద్ధ పీఠాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆ తర్వాత ఓమ్ ఆకారం వేదిక వద్ద పురటాసి పౌర్ణమి పూజలకు సంబంధించిన గురుపూజోత్సవం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు గురుపీఠంలో ఆధారపీఠం నెలకొల్పే కార్యక్రమం, రాత్రి 7 గంటలకు గోపురకలశ ప్రతిష్ఠాపన జరిగాయి. గురువారం ఉదయం పీఠానికి వేంచేసిన మేల్‌మరువత్తూరు ఆధ్యాత్మిక ఉద్యమం అధ్యక్షురాలు లక్ష్మీ బంగారు అడిగళార్‌కు రామనాథపురం, శివగంగ, పుదుకోట జిల్లాలకు చెందిన ఇన్‌ఛార్జులు, భక్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గురుపీఠంలో బంగారు అడిగళార్ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఉదయం 10.45 గంటలకు గర్భాలయంలో అరుళ్ జ్ఞానదీపాన్ని వెలిగించి ఆలయమంతా ప్రదక్షిణ చేసి ఓంకార వేదిక వద్ద ఉంచారు. ఆదిపరాశక్తి అమ్మవారి గర్భాలయం ముందు, గురుపీఠం ఎదుట యాగగుండాలు ఏర్పాటు చేసి యాగాలు నిర్వహించారు. ఈ యాగ పూజలను కూడా లక్ష్మీ బంగారు అడిగళార్ ప్రారంభించారు. ఆధ్యాత్మిక ఉద్యమం ఉపాధ్యక్షులు అన్బగన్, సెంథిల్‌కుమార్, శ్రీదేవి రమేష్, ఉమాదేవి, జయగణేష్, డాక్టర్ శ్రీలేఖా సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులందరికీ అన్న సంతర్పణ కూడా చేశారు. శుక్రవారం ద్వితీయ కాల యాగపూజలు, అడిగళార్ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన మీదట గురుకృప దర్శన కార్యక్రమం జరుగుతుంది.

మూడు రోజుల్లో మూడడుగులు పెరిగిన పుళల్ నీటిమట్టం

పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్, చెంగల్పట్టు జిల్లాల్లో భారీవర్షాలు కురిశాయి. చోళవరంలో 30 సెం.మీ, రెడ్‌హిల్స్‌లో 28 సెం.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా నగరానికి తాగునీరందించే పూండి, పుళల్, చెంబరంబాక్కం, చోళవరం, కన్ననకోట తేర్వాయ్‌కండిగై తదితర జలాశయాల్లో నీటిమట్టాలు పెరిగాయి. పుళల్ జలాశయం మాత్రమే మూడు రోజుల్లో మూడడుగులకు పైగా నీటిమట్టం పెరిగింది. ప్రస్తుతం నీటిమట్టం 2,388 మిలియన్ ఘనపుటడుగులకు చేరి 72 శాతం నీటితో ఉంది. భారీవర్షాల కారణంగా చెంబరంబాక్కం జలాశయానికి అత్యధికంగా 1,380 ఘనపుటడుగుల నీరు వస్తున్న నేపథ్యంలో, బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వర్షం కురవకపోవడంతో నీటి రాక తగ్గింది. గురువారం ఉదయం జలాశయానికి 493 ఘనపుటడుగుల నీరు వస్తోంది. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 24 అడుగులు కాగా ప్రస్తుతం 13.79 అడుగులుంది. అలాగే, చోళవరం జలశయానికి 498 ఘనపుటడుగుల నీరు వస్తోంది. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 1081 మిలియన్ ఘనపుటడుగులు కాగా ప్రస్తుతం 198 మిలియన్ ఘనపుటడుగుల నీటినిల్వలున్నాయి., పూండి జలాశయానికి కృష్ణా జలాలు, వర్షపు నీరు మొత్తం 750 ఘనపుటడుగుల నీరు చేరుతోంది. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 3,231 మిలియన్ ఘనపుటడుగులు కాగా ప్రస్తుతం 450 మిలియన్ ఘనపుటడుగులుంది. కన్ననకోట తేర్వాయ్ కండిగై జలాశయానికి 10 ఘనపుడుగుల నీరు చేరుతోంది. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 500 మిలియన్ ఘనపుటడుగులు కాగా ప్రస్తుతం 390 ఘనపుటడుగుల నీటినిల్వలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.



పుళల్ జలాశయం

నేడు జాబ్ మేళా

పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 నుంచి ప్రైవేటు జాబ్ మేళా జరుగనుంది. ఈ మేళాలో 25 సంస్థలు సుమారు 500 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. 10,12 తరగతులు, ఐటీఐ, డిప్లొమో చేసిన వారు ఈ మేళాలో పాల్గొనాలని జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

కున్నూర్- ఊటీ కొండ రైలు ప్రారంభం

పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూర్-ఊటీ మధ్య కొండ రైలు సేవలు గురువారం ప్రారంభమయ్యాయి. భారీవర్షాల కారణంగా ఈ మార్గంలోని లవ్‌డేల్ ప్రాంతంలోని రైలు పట్టాలపై మట్టిచెరియలు విరిగిపడడంతో కొండ రైలు రద్దు చేశారు. పట్టాలపై పడిన కొండచరియలు తొలగించిన నేపథ్యంలో, రెండు రోజుల అనంతరం గురువారం యథావిధిగా కొండ రైలు సేవలు ప్రారంభం కావడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేశారు.

ఎనిమిది విమానాల రద్దు

పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల హెచ్చరికల కారణంగా ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండడంతో నగరం నుంచి 8 విమానాలు రద్దయ్యాయి. అండమాన్, మదురై, తిరుచ్చి, ఢిల్లీ తదితర నగరాలకు వెళ్లే నాలుగు విమానాలు, అక్కడి నుంచి రావాల్సిన నాలుగు విమానాలు రద్దు చేశారు. భారీవర్ష సూచనలతో నేపథ్యంలో గురువారం కూడా విమానాశ్రయంలో ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉంది. పలువురు ప్రయాణికులు భద్రతా కారణాలతో ప్రయాణాలు రద్దు చేసుకుంటున్నారు. మూడు రోజులుగా తగినంత మంది ప్రయాణికులు లేకపోవడంతో సుమారు 20కి పైగా విమానాలు రద్దుకావడం గమనార్హం.

తాగునీటి నాణ్యత పరిశీలన

పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల సీజన్ ప్రారంభం కావడంతో అంటువ్యాధులు ప్రబలకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలను చేపట్టింది. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి నాణ్యత పరిశీలించనున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకారం, తమిళనాడు తాగునీరు, మురికినీటి బోర్డు పరిధిలోని 113 ప్రయోగశాలల్లో ప్రతిరోజు సుమారు 4,500 తాగునీటి నమూనాలను పరిశీలించనున్నారు. అందుకోసం గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా ఆయా ప్రాంతాల్లో సరఫరా చేస్తున్న తాగునీటి శాంపిల్స్ పరిశోధనలకు పంపించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లు


పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి తిరువళ్లూర్ మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు గురువారం నుంచి యథావిధిగా సాగాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా నగరంలో గత సోమవారం రాత్రి నుంచి కురిసిన వర్షాల కారణంగా బేసిన్ బ్రిడ్జి-వ్యాసర్పాడి స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై వరద నీరు చేరింది. దీంతో, ఏలగిరి, కావేరి సహా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆవడి, తాంబరం స్టేషన్ల నుంచి నడిపడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో, రైలు పట్టాల మధ్య నిలిచిన నీటిని కార్మికులు పూర్తిగా తొలగించడంతో అరక్కోణం మార్గంగా వచ్చే రైళ్లు బుధవారం సాయంత్రం యధావిధిగా చెన్నై సెంట్రల్‌కు చేరుకున్నాయి. గురువారం నుంచి ఈ మార్గంలో రైళ్ల సేవలు యధావిధిగా కొనసాగుతాయని దక్షిణరైల్వే ప్రకటన విడుదలచేసింది.

జోరుగా గొడుగుల విక్రయాలు



పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల సీజన్ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో, గొడుగుల విక్రయాలు ఊపందుకున్నాయి. ప్రధాన షోరూమ్, చిన్న దుకాణాలు, ఫుట్ పాత్‌లపై గొడుగుల విక్రయాలు జరుగుతున్నాయి. ఫుట్ పాత్‌లపై మీడియం సైజు రూ.150 నుంచి 200, పెద్ద గొడుగు రూ.175 నుంచి రూ.250 వరకు విక్రయమవుతుండగా, షోరూమ్‌ల్లో ధరలు అధికంగా ఉన్నాయి.

రైళ్లలో పోలీసుల తనిఖీలు



పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా విరుదునగర్, శివకాశి మార్గంగా వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. దేశంలోనే బాణసంచా తయారీకి పేరుగాంచిన శివకాశి జిల్లా నుంచి పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు బాణసంచా ఎగుమతి చేస్తుంటారు. అదే సమయంలో, పండుగ సందర్భంగా కొందరు అనుమతి లేకుండా అక్రమంగా రైళ్లలో బాణాసంచా తరలిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులందాయి. దీంతో, విరుదునగర్, శివకాశి మార్గంలో వెళ్లే అన్ని రైళ్లలో పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. దీపావళి పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

ఈషా కేంద్రం చెప్పేవి అబద్ధాలు...

● సుప్రీంకోర్టుకు తెలిపిన పోలీసు శాఖ

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోవై ఈషా యోగా కేంద్రం చెబుతున్నవి అబద్ధాలని సుప్రీంకోర్టుకు రాష్ట్ర పోలీసు శాఖ నివేదిక సమర్పించింది. ఈ కేంద్రంలో యోగా శిక్షణ పొందుతున్న తన కుమార్తెలను తమకు అప్పగించాలని కోరుతూ మాజీ ప్రొఫెసర్ కామరాజ్ దాఖలుచేసిన పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, ఈషా యోగా కేంద్రంపై ఉన్న కేసుల వివరాలు తెలపాలని రాష్ట్ర పోలీసు శాఖను ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులతో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు సంయుక్తంగా ఈషా యోగా కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో, హైకోర్టు ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ ఈషా యోగా కేంద్రం దాఖలుచేసిన పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు, మద్రాసు హైకోర్టు ఉత్తర్వులపై తాత్కాలిక స్టే విధించడంతో పాటు ఈ విషయమై నివేదిక సమర్పించాలని రాష్ట్ర పోలీసు శాఖను ఆదేశించింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర పోలీసు శాఖ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన నివేదికలో... ఈషా యోగా కేంద్రంలో ఉన్న వారు మానసికంగా ఇబ్బంది పడుతున్నారని, వారికి కౌన్సెలింగ్ అవసరమని నిపుణులు సూచించారని తెలిపింది. ఈ కేంద్రంలో తగిన అనుమతులతో ఆస్పత్రి ఉన్నా, ఎక్స్‌రే విభాగానికి ఇప్పటివరకు అనుమతివ్వలేదని తెలిపింది. అక్కడ ఏర్పాటుచేసిన లైంగిక వేధింపుల నిరోధక కమిటీ కూడా సక్రమంగా పనిచేయడం లేదన్నారు. కానీ, ఈ కేసులో ఈషా యోగా కేంద్రం చెబుతున్నవి అసత్యాలని పోలీసు శాఖ తెలిపింది.

పొలం పనులకూ ఉత్తరాది కార్మికులే...!



నాట్లు వేస్తున్న ఉత్తరాదివాసులు

పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఉత్తరాది రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో యువత రాష్ట్రానికి వస్తున్నారు. భవన నిర్మాణాలు చేపట్టే సంస్థలు ఉత్తరాది నుంచి యువకులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకొస్తుండగా, మరికొందరు ఇక్కడకు వచ్చి పనులు వెతుక్కుంటున్నారు. ఆ క్రమంలో, ప్రస్తుతం టీ దుకాణాలు, హోటళ్లు, షోరూమ్‌లు, దుకాణాలు సహా అన్ని ప్రాంతాల్లో ఉత్తరాది యువకులే కనిపిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో కూడా వారు పాల్గొంటుండడం గమనార్హం. గ్రామాల్లో అమలవుతున్న ఉపాధి హామీలో స్థానికులు పాల్గొంటుండడంతో వ్యవసాయ పనులకు కొరత ఏర్పడింది. దీంతో, ఉత్తరాది వాసులను వ్యవసాయ పనులకు రైతులు ఉపయోగించుకుంటున్నారు. కడలూరు జిల్లా భువనగిరి, చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయ పనుల్లో పెద్ద సంఖ్యలో ఉత్తరాది వాసులు పాల్గొంటున్నారు.

హెల్మెట్ ధరించలేదని కలెక్టర్ కార్యాలయానికి అనుమతి నిరాకరణ

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయానికి ద్విచక్రవాహనాలపై వచ్చే ప్రజలు, కార్యాలయ ఉద్యోగులు, అధికారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని కారైక్కాల్ జిల్లా కలెక్టర్ మణికంఠన్ ఆదేశించారు. ఉత్తర్వులు అతిక్రమించి హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై వచ్చే వారికి కార్యాలయంలోకి అనుమతించరాదని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో, బుధవారం ఉదయం హెల్మెట్ లేకుండా కార్యాలయానికి వచ్చిన పలువురిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, సదరు వాహనచోదకులు సమీపంలోని దుకాణాల్లో హెల్మెట్ కొనుగోలు చేసి ధరించి వచ్చిన తర్వాతే పోలీసులు వారిని కార్యాలయ ప్రాంగణంలోకి అనుమతించారు.

26న గ్యాస్ సిలిండర్ డెలివరీ కార్మికుల ఆందోళన

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనం కోసం గ్యాస్ సిలిండర్ల డెలివరీ కార్మికులు ఈ నెల 26వ తేది సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు. దేశంలోని పెట్రోలియం సంస్థలు ఇళ్లకు, వాణిజ్య అవసరాలకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 1,800లకు పైగా గ్యాస్ ఏజెన్సీలున్నాయి. ఈ ఏజెన్సీల ద్వారా సిలిండర్లను కార్మికులు వినియోగదారుల ఇళ్లకు డెలివరీ చేస్తుంటారు. కానీ, వారికి వేతనం తక్కువగా ఇస్తున్నారని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్‌తో ఈ నెల 26న సమ్మె చేపట్టనున్నట్లు డెలివరీ కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

మూడు రోజుల్లో 14,447 టన్నుల చెత్త తొలగింపు

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో మూడు రోజుల్లో 14,447 టన్నుల చెత్త తొలగించినట్లు అధికారులు తెలిపారు. వాయుగుండం కారణంగా నగరంలో కురిసిన భారీవర్షాల కారణంగా కాలువల్లోని చెత్త రోడ్లపైకి వచ్చి చేరింది. దీంతో, ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు జీసీసీ పరిధిలోని 15 మండలాలు, కోయంబేడు మార్కెట్ ప్రాంగణం తదితరాల్లో 14,447 టన్నుల చెత్త తొలగించినట్లు అధికారులు తెలిపారు.

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు



పెరంబూర్,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా తంజావూరు బృహదీశ్వర ఆలయం చుట్టూ ఉన్న గిరిప్రదక్షిణలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ జీర్ణోద్ధరణ పనుల కారంగా ఎనిమిదేళ్లుగా భక్తులను గిరి ప్రదక్షిణకు అనుమతించలేదు. భక్తుల విజ్ఞప్తి మేరకు గత నెల పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణకు అనుమతించారు. ఈ నేపథ్యంలో, ఈ నెల పౌర్ణమి రోజైన గురువారం మేళతాళాలు, కోలాటం సహా పలువురు కళాకారులు ప్రదర్శన ముందు సాగుతుండగా, భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

తిరువేర్కాడు ఆలయంలో యువతులతో రీల్స్

● మహిళా ధర్మకర్తపై చర్యలకు హైకోర్టు ఆదేశం

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరువేర్కాడు దేవి కరుమారియమ్మ ఆలయంలో రీల్స్ తీసిన ఆ ఆలయ మహిళా ధర్మకర్త వలర్మతిపై చర్యలు చేపట్టి నివేదిక సమర్పించమంటూ హైకోర్టు ప్రభుత్వానికి ఉత్తర్వు జారీ చేసింది. ఇటీవల ఆ ఆలయంలో మహిళా ధర్మకర్త వలర్మతి 12 మంది మహిళతో నృత్యం చేయించి, దానిని వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేసింది. దీనిపై నాగపట్టినంకు చెందిన జయ ప్రకాష్ అనే భక్తుడు హైకోర్టులో పిటిషన్ వేశారు. హిందువులకు అత్యంత పవిత్రమైన ఆ ఆలయంలో మహిళా ధర్మకర్త 12మంది యువతులతో నృత్యం చేసేందుకు అనుమతించి రీల్స్ తీయడం గర్హనీయమన్నారు. రీల్స్ తీసిన దర్మకర్తపై కఠిన చర్యలు తీసుకునేలా దేవాదాయ శాఖకు ఉత్తర్వులివ్వాలని ఆయన కోరారు. హైకోర్టు న్యాయమూర్తి ఎం.దండపాణి ఎదుట గురువారం ఉదయం ఈపిటిషన్ విచారణకు వచ్చింది. ఆ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఆలయంలో భక్తులంతా భక్తిశ్రద్ధలతో వస్తుంటారని, అలాంటి పవిత్రమైన ఆలయంలోని అమ్మవారంటే ఏ మాత్రం భయం లేకుండా ఆలయ ధర్మకర్త రీల్స్ తీయడాన్ని ఏమాత్రం సహించలేమన్నారు. ఈ వ్యవహారంలో సంబంధీకులపై కఠిన చర్యలు తీసుకుని ఈ నెల 29లోగా తమకు నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ఉత్తర్వు జారీ చేశారు. అదే రోజు తదుపరి విచారణ జరుగుతుందని ప్రకటించారు.

విధులకు హాజరైన సామ్‌సంగ్ కార్మికులు

పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నెలరోజుల సమ్మె అనంతరం సామ్‌సంగ్ కార్మికులు గురువారం నుంచి విధులకు హాజరయ్యారు. ఈ విషయమై సీఐటీయూ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు సౌందర్‌రాజన్ మాట్లాడుతూ... ప్రజాపనుల శాఖ మంత్రి ఏవీ వేలు సమక్షంలో ఇరుతరఫు ప్రతినిధులతో జరిపిన చర్చలు సామరస్యంగా ముగిశాయన్నారు. తదుపరి చర్చలు నవంబరు 7వ తేది మళ్లీ చర్చలు జరుపుతామని అధికారులు హామీ ఇచ్చారని, అందువల్ల సమ్మె విరమించుకొని కార్మికులకు విధులకు హాజరయ్యారని తెలిపారు. అదే సమయంలో సమ్మెలో పాల్గొన్న కార్మికులపై యాజమాన్యం ఎలాంటి కక్షసాధింపు చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం పర్యవేక్షించాలని ఆయన కోరారు.

మురుగన్ హుండీ ఆదాయం రూ.17 లక్షలు

పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా ఒరగడం సమీపం వల్లకోట సుబ్రమణ్యస్వామి ఆలయ హుండీ లెక్కింపు ఇటీవల జరిగింది. ఈ ఆలయంలో మూడు నెలలకు ఒకసారి హుండీల లెక్కింపు జరుగుతుండగా, హిందూ దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ కార్తికేయన్ నేతృత్వంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు రూ.17,03,808 నగదు, 54 గ్రాముల బంగారం, 1,400 గ్రాముల వెండి కానుకగా సమర్పించారని ఆలయ అధికారులు తెలిపారు.

హ్యుండాయ్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు

● రూ.1500 కోట్లతో విస్తరణ కార్యక్రమాలు

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చెన్నై సమీపం ఇరుంగాట్టుకోట్టై ప్రాంతంలో ఉన్న హ్యుండాయ్ కార్ల కంపెనీలో రూ.1500 కోట్ల పెట్టుబడితో విస్తరణ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఆ ఫ్యాక్టరీలో తయారయ్యే వాహనాలన్నీ దేశవిదేశాలకు ఎగుమతవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ఫ్యాక్టరీలో జరుగుతున్న ఎలక్ట్రిక్ కార్లు ఉత్పత్తి కూడా ఊపందుకుంది. ప్రస్తుతం ఆ ఫ్యాక్టరీలో 19 వేల మందికిపైగా పనిచేస్తున్నారు. విస్తరణ పనులు పూర్తయితే మరో 155 మందికి ఉపాధి కలుగుతుందని ఆ ఫ్యాక్టరీ నిర్వాహకులు చెబుతున్నారు.

మందకొడిగా సభ్యత్వ నమోదు

● రాష్ట్ర మహిళా కాంగ్రెస్ రద్దు

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆశినంతమేరకు సభ్యులను చేర్పించకపోవడంతో రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌ను పార్టీ అధిష్ఠానం రద్దు చేసింది. గత నెల 15 నుంచి రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మహిళా కాంగ్రెస్‌లో ఎంతమందిని సభ్యులుగా చేర్చుకోవాలన్న విషయమై అఖిల భారత మహిళా కాంగ్రెస్ టార్గెట్ కూడా నిర్ణయించింది. జిల్లా శాఖ అధ్యక్షురాలు కనీసం వందమందిని, రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షురాలు 500 మందిని, ప్రధాన కార్యదర్శి 300 మందిని, కార్యదర్శులు 70 మందిని సభ్యులుగా చేర్చాలని ఆదేశించింది. ఈ టార్గెట్‌ను రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సాధించకపోవడంతో మహిళాకాంగ్రెస్‌ని సమూలంగా రద్దు చేస్తూ ప్రకటన వెలువరించింది.

గ్రామంలో ప్రవేశించిన అడవి ఏనుగు



పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోయంబేడు జిల్లా వెల్లయంగిరి కొండ ప్రాంతంలోని సోమ్మేడు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి అడవి ఏనుగు ప్రవేశించింది. ఆ ప్రాంతంలోని రేషన్ దుకాణం గోడ ధ్వంసం చేసిన ఏనుగు, తొండంతో బస్తాల నుంచి బియ్యం తీసుకొని ఆరగించింది. గోడ ధ్వంసమైన శబ్దానికి ఇళ్ల నుంచి బయటకు వచ్చిన ప్రజలు ఏనుగు చూసి దిగ్భ్రాంతి చెందారు 'పో సామి పో' అంటూ ప్రజలు వేడుకున్నారు. ఈ దృశ్యాలను వీడియోగా చిత్రీకరించిన యువకులు అటవీ శాఖకు ఫిర్యాదు చేసి, బాణాసంచా కాల్చి ఏనుగును అడవిలోకి పంపారు.

మూడు రోజుల తర్వాత చేపల వేటకు జాలర్లు



వేదారణ్యం హార్బర్ నుంచి బయలుదేరిన జాలర్లు

పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హెచ్చరికల కారణంగా ఇళ్లకే పరిమితమైన జాలర్లు మూడు రోజుల అనంతరం గురువారం ఉదయం చేపల వేటకు బయల్దేరి వెళ్లారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడం, ఈదురుగాలులు, ఎగిసిపడే అలల కారణంగా జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని గత సోమవారం రాష్ట్రప్రభుత్వం హెచ్చరించింది. దీంతో, రాష్ట్రవ్యాప్తంగా తీరప్రాంత జిల్లాల జాలర్లు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షాలు తగ్గి, సముద్రంలో వాతావరణం యథాస్థితికి చేరుకున్న నేపథ్యంలో, మత్స్య శాఖ అధికారుల అనుమతితో గురువారం జాలర్లు చేపల వేటకు బయల్దేరి వెళ్లారు.

ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతుల్లో పన్ను ఎగవేత

● వ్యాపారవేత్త ఇంట్లో ఐటీ తనిఖీలు

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదాయం తక్కువగా చూపారనే కారణంగా ప్రముఖ వ్యాపారవేత్త ఇల్లు, మరో మూడు ప్రాంతాల్లో ఆదాయపు పన్నుశాఖ అధికారులు గురువారం తనిఖీలు జరిపారు. కోడంబాక్కం యునైటెడ్ ఇండియా కాలనీకి చెందిన వ్యాపారవేత్త, సెల్‌ఫోన్, టీవీ తదితర ఎలక్ట్రానిక్ పరికరాల హోల్‌సేల్ విక్రయ దుకాణాలకు అధిపతి. రాష్ట్రంలో పాటు కేరళ, కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాల్లో కూడా విక్రయ కేంద్రాలు నడుపుతున్నారు. ఆయన విదేశాల నుంచి సెల్‌ఫోన్లు, టీవీలు సహా పలు ఎలక్ట్రానిక్ వస్తువులు దిగుమతి చేసుకుంటున్నారు. సదరు సంస్థ దిగుమతుల వివరాలను సక్రమంగా చూపడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, కోడంబాక్కంలోని ఆ వ్యాపారవేత్త ఇల్లు, పల్లావరంలోని సంస్థ ప్రధాన కార్యాలయం, పల్లికరనైలోని శాఖా కార్యాలయంలో గురువారం ఉదయం ఐటీ కమిషనర్ నేతృత్వంలో 15 మందితో కూడిన బృందాలు ఆకస్మికతనిఖీలు చేపట్టాయి. కోడంబాక్కంలో ఇంటికి వచ్చిన అధికారులు ఉదయం 7 గంటల నుంచి చేపట్టిన తనిఖీల్లో, దిగుమతులు, వాటికి చెల్లించాల్సి పన్ను ఎగవేత తదితర వివరాలతో పాటు 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో సంస్థ ఆదాయ, వ్యయాల వివరాలు సేకరించారు.

పంజాబ్ సీఎంకు స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో.... పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మీరు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, చేపట్టబోయే కార్యాలు విజయవంతం కావాలంటూ సీఎం స్టాలిన్ ట్వీట్ చేశారు.

దీపావళి సందర్భంగా 16,500 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రజల కోసం 16,500 ప్రత్యేక బస్సులు నడపాలని రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) నిర్ణయించింది. పండుగ సమయాల్లో నగరం నుంచి ఇతర ప్రాంతాలకు ఎస్ఈటీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ ఏడాది దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 16,500 ప్రత్యేక బస్సులు నడపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పండుగకు మూడు రోజుల ముందు నుంచి 10,500 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ విషయమై ఈ నెల 19వ తేది రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ నేతృత్వంలో జరుగనున్న సమావేశం అనంతరం అధికారికంగా ప్రకటించనున్నారు. దీపావళి సందర్భంగా 5.5 లక్షల మంది ప్రయాణించే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ బస్సుల్లో టిక్కెట్ల రిజర్వేషన్‌కు www.tnstc.in అనే వెబ్‌సైట్, టీఎన్‌ఎస్‌టీసీ అనే మొబైల్ యాప్ వినియోగించవచ్చు. కాగా, ప్రస్తుతం నడుపుతున్న బస్సుల్లో దీపావళి రిజర్వేషన్ ఫుల్ అయినట్లు సమాచారం.

'రెడ్ అలర్ట్' అన్నారు.. చుక్క నీరు కూడా పడలేదు...!

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి

పెరంబూర్, అక్టోబరు 17: 'రెడ్ అలర్ట్' ప్రకటించిన చెన్నై వాతావరణ కేంద్రం తీరుపై పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి రాందాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన తన ఎక్స్ పేజీలో.. నగరానికి గత బుధవారం రెడ్ అలర్ట్ ప్రకటించారు. కానీ, ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్క చుక్క నీరు కూడా కురవలేదు. వాతావరణ పరిస్థితులు సక్రమంగా అంచనా వేసి సమాచారం అందించడం ద్వారా మాత్రమే, ప్రజలు, ప్రభుత్వం తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొనే అవకాశముంటుందని అన్బుమణి ట్వీట్ చేశారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో మరొకరి అరెస్టు

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్ స్ట్రాంగ్ హత్యకేసులో లుక్అవుట్ జారీ అయి, పరారీలో ఉన్న సురేష్ కృష్ణా అనే మరో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకూ 27మందిని అరెస్టు చేశారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్య జరిగినప్పటి నుండి సురేష్‌కృష్ణ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం మీనంబాక్కం విమానాశ్రయం వద్ద సురేష్‌కృష్ణను పోలీసులు అరెస్టు చేశారు.

విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు

ప్లస్ వన్ విద్యార్థులను హెచ్చరించిన పోలీసులు

ప్యారీస్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కంలోని విమానాశ్రయానికి బాంబు బెదిరింపు పాల్పడిన ఘటనలో ఇద్దరు ప్లస్ వన్ విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విమానాశ్రయానికి మంగళవారం ఫోన్ చేసిన గుర్తుతెలియని వ్యక్తి, విమానాశ్రయ టాయిలెట్‌లో శక్తివంతమైన బాంబు ఉందని, అది కొన్ని నిముషాల్లో పేలుతుందని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ఈ విషయమై అధికారుల ఫిర్యాదుతో విమానాశ్రయ పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌తో అక్కడకు చేరుకుని క్షుణ్ణంగా తనిఖీచేసి బాంబు బెదిరింపు ఫేక్ అని నిర్ధారించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన విమానాశ్రయ పోలీసులు సెల్‌ఫోన్ నెంబరు ఆధారంగా తాంబరం సమీపం సేలయూర్ ప్రాంతం నుంచి వచ్చినట్లు గుర్తించారు. దీంతో, సేలయూర్ పోలీసుల సాయంతో అక్కడకు వెళ్లిన పోలీసులు, క్రోంపేట హస్తినాపురం, సేలయూర్ సమీపం దక్షిణ అగరం ప్రాంతానికి చెందిన ఇద్దరు ప్లస్ వన్ విద్యార్థులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. తాము సరదా కోసం చేశామని, తమను క్షమించి వదిలిపెట్టాలని విద్యార్థులు పోలీసులను వేడుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను స్టేషన్‌కు రప్పించిన పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి హెచ్చరించి పంపించారు.

తెప్పకాడులో శిబిరంలో గున్న ఏనుగు మృతి

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెప్పకాడు ఏనుగుల శిబిరంలో ఓ గున్న ఏనుగు గురువారం వేకువజాము మృతిచెందింది. మార్చిలో ఈరోడ్ జిల్లా బన్నారి అటవీ ప్రాంతంలో తల్లి ఏనుగును విడిచి సంచరించిన గున్నఏనుగును అటవీ శాఖ అధికారులు తెప్పకాడు ఏనుగుల సంరక్షణ శిబిరానికి తరలించారు. గత ఏడునెలలుగా శిబిర నిర్వాహకులు ఆ గున్నఏనుగును సంరక్షిస్తున్నారు. 15 రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆ ఏనుగుకు చికిత్స అందించారు. చివరకు గురువారం వేకువజామున ఆ గున్న ఏనుగు మృతి చెందింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్యశిబిరాలు



జాఫర్‌ఖాన్‌పేట వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు చేసుకుంటున్న మహిళ

పెరంబూర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసినట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమైన రెండు రోజుల్లో 44 సెం.మీ వర్షపాతం నమోదుకాగా, రాజధాని నగరంలో 20 నుంచి 25 సెం.మీ వర్షం కురిసిందన్నారు. ముందస్తు చర్యలతో విపత్తు నుంచి ప్రజలను రక్షించామన్నారు. వర్షాకాలంలో ప్రబలే సీజన్ వ్యాధులు అడ్డుకొనేలా రెండు రోజుల క్రితం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన 1,288 వైద్యశిబిరాల ద్వారా 78,000 మంది వైద్యపరీక్షలు అందించగా, వారిలో 6,005 మంది ఐదేళ్లలోపు చిన్నారులున్నారని తెలిపారు. వర్షాకాలం ముగిసే వరకు, వరద నీరు అధికంగా చేరే ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

థౌజండ్‌లైట్ మసీదుకు బాంబు బెదిరింపు

అడయార్, అక్టోబరు 17: స్థానిక థౌజండ్‌లైట్‌లోని మసీదుకు బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో అప్రమత్తమైన నగర పోలీసులు ఈ మసీదు ప్రాంగణంతో పాటు పరిసరాలను పరిశీలించి, ఎలాంటి బాంబు లేదని నిర్ధారించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. చెన్నై నగరంలోని థౌజండ్‌లైట్ మసీదులో మరికొద్ది సేపట్లో బాంబు పేలనుందంటూ కోయంబత్తూరు విమానాశ్రయ అధికారులకు ఒక ఈమెయిల్ వచ్చింది. ఈ విషయాన్ని చెన్నై ఎయిర్‌పోర్టు అధికారులకు, వారు నగర పోలీసులకు సమాచారం చేరవేశారు.ఆ వెంటనే అప్రమత్తమైన థౌజండ్‌లైట్ పోలీసులు హుటాహుటిన మసీదు ప్రాంతానికి చేరుకుని, బాంబు స్క్వాడ్, పోలీస్ జాగిలాలతో తనిఖీ చేసి, ఎలాంటి బాబు లేదని నిర్ధారించారు. అలాగే, బాంబు బెదిరింపుతో ఈమెయిల్ పంపిన అగంతకుడిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

బాలికపై అఘాయిత్యం

● ముగ్గురి అరెస్టు

అడయార్, అక్టోబరు 17: సేలం జిల్లాలో టూర్ పేరుతో ఒక బాలికను కొల్లిమలై పర్యాటక ప్రాంతానికి తీసుకెళ్ళి అత్యాచారానికి పాల్పడిన కేసులో ఆ బాలిక ప్రియుడి సహా, అతడికి సహకరించిన మరో ఇద్దరిని సేలం రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సేలం జిల్లాకు చెందిన ఓ యువకుడు కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. ఈ యువకుడు ప్లస్ వన్ చదివే బాలికను గత కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం టూర్ పేరుతో బాలికను కొల్లిమలై ప్రాంతానికి తీసుకెళ్ళాడు. అతడితో పాటు అతడి స్నేహితులు కూడా వెళ్ళారు. వీరంతా కొల్లిమలైలో ఒక గది అద్దెకు తీసుకున్నారు. ఆ సమయంలో బాలికపై ఆ యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. మరుసటి రోజున ఆ బాలికను తీసుకొచ్చి ఇంటివద్ద వదిలివెళ్ళాడు. ఒక రాత్రి ఇంటికి రాకపోవడంపై బాలికను తల్లిదండ్రులు నిలదీయడంతో అసలు విషయాన్ని వెల్లడించారు. దీంతో సేలం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ముగ్గురు యువకులను అరెస్టు చేశారు.

ఆధ్యాత్మికం

అద్భుతాలకు నిలయం సురుళి వేలప్పర్ ఆలయం

● సిద్ధపురుషుల సంచార క్షేత్రం

తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ కొలువుదీరిన తేని జిల్లా సురుళిమలైలోని వేలప్పర్ ఆలయం ఎన్నో అద్భుతాలను ఆవిష్కరించే దివ్య శైవక్షేత్రం. ఇదొక గుహాలయం.. ఇక్కడి విభూతి గుహలో ఉన్న తేమతో కూడిన ఇసుక ఎండిన తర్వాత సువాసనలు వెదజల్లే విభూతిగా మారుతుంది.. ఈ ఆలయం వద్దనున్న ఓ చెట్టుపై యేళ్లతరబడి జలపాతాలలు ఉధృతంగా పడటంతో ఆ చెట్టే శిలగా దర్శనమిస్తోంది. ఆ చెట్టు వేర్లన్నీ ప్రస్తుతం శిల్పి చెక్కుబడినట్టుగా శిలా వేర్లుగా వింతగొలుపుతుంది. ఈ శిలా వృక్షం వేర్లున్న ప్రాంతం వద్ద జలంలో పడే ఆకులు, కొమ్మలు 48 రోజుల తర్వాత శిలలుగా మారటం మహాద్భుతమని భక్తులు చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, చెన్నై



కైలాస గుహ ప్రాంతం

స్థలపురాణం..

మహావిష్ణువు కుమార్తె వళ్లిదేవిని పర్వతరాజైన నంబిరాజన్ పెంచి పోషించారు. ఆ అందాల వనిత సుగుణాలను పరిశీలించిన మురుగప్పెరుమాన్ కొన్ని లీలా విశేషాలు చేసి పరిణయమాడారు. ఆ సందర్భంగా నంబిరాజన్ స్వామివారికి కొన్ని పర్వతాలను కానుకలుగా ఇచ్చారు. వాటిలో ఈ సురుళి మలై కూడా ఒకటి. మురుగప్పెరుమాన్ తన ఇష్టసఖి వళ్లిదేవితో కొంతకాలం ఇక్కడ బసచేసినట్లు స్థలపురాణం చెబుతోంది. పూర్వం శనీశ్వరుడి గ్రహసంచారం ప్రకారం దేవతలను ముప్పతిప్పలు పెట్టేందుకు సిద్ధమయ్యారు. దేవతలంతా సురుళిమలై క్షేత్రంలో ఉన్న సురుళియప్పన్‌ను ఆశ్రయించారు. దేవతలందరికీ స్వామివారు ఆశ్రయం ఇచ్చి శని ప్రభావం నుంచి రక్షించారు. ఈ క్షేత్రం వద్ద నున్న జలపాతంలోని జలాలు శ్రావ్యమైన సంగీతంతో జారిపడుతుండటంతో ఈ పర్వతాన్ని 'శ్రుతి మలై' అని, కాలగమనంలో 'సురుళి మలై' అంటూ పేరుగడిచింది. సురుళి మలైలో కొలువైన స్వామివారిని 'సురుళి వేలప్పర్' అని పిలుస్తున్నారు. ఈ క్షేత్రంలోని స్వామివారు పళని దండాయుధపాణిలాగే కౌపీనధారియై ఆండి (బిక్షగాడి) రూపంలో ఉండటం వల్ల 'సురుళియాండి' అనే పేరుతెచ్చుకున్నారు.



పవిత్రజలంతో ఉన్న నీటితొట్టె

ఆలయ విశేషాలు..

ఆడి, తై, పురటాసి మహాలయ అమావాస్య దినాల్లో భక్తులు ఇక్కడి సురళి జలపాతంలో స్నానమాచరించి తమ పితృదేవతలకు తర్పణాలు వదలడం ఆనవాయితీ. ఆడి అమావాస్య సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తారు. సంతానం లేని ఓ భక్తుడికి సురళియప్పరే కుమారుడి స్థానంలో అంత్యక్రియలు జరిపినట్లు స్థలపురాణంలో ఉంది. కనుక సంతానం లేనివారి తమ చరమాంక దశలో ఇక్కడి స్వామివారిని ఆశ్రయిస్తూ వేడుకోవటం ఆనవాయితీగా మారింది. ఇక్కడే భూతనారాయణ పెరుమాళ్ ఆలయం కూడా ఉంది. ఈ పెరుమాళ్ సన్నిధి లోపల శివలింగం కూడా ఉండటం విశేషం.. దీంతో ఈ ఆలయంలో విభూతి, కుంకుమ ప్రసాదంగా ఇస్తున్నారు. ఉచ్చికాల పూజ సందర్భంగా తులసి తీర్థం కూడా ఇస్తారు. ఈ ఆలయంలోని పెరుమాళ్‌కు పరివారమూర్తిగా నరసింహ స్వామి, పరమేశ్వరుడికి పరివారమూర్తిగా దక్షిణామూర్తి కొలువుదీరి ఉన్నారు. స్వామివారికి విశేష అభిషేకాలు, ఆరాధనలు జరుగుతాయి.

కైలాస గుహ..

పరమేశ్వరుడి కల్యాణం సందర్భంగా దేవతలు, మునులు అందరూ హిమాలయానికి వెళ్లటంతో పుడమి ఉత్తర ప్రాంతం పైకి చేరి, దక్షిణ ప్రాంతం కిందకు ఒరిగి సమతుల్యం కోల్పోయింది. పరమేశ్వరుడు అగస్త్యమహర్షిని పిలిచి దక్షిణాన ఉన్న పొదిగై పర్వతానికి వెళ్ళి పుడమిని సమతుల్యం చేయమంటూ ఆదేశించారు. అగస్త్యమహర్షి పరమేశ్వరుడి కల్యాణం చూడకుండానే పొదిగై మలైకి వెళ్ళి పుడమిని సమతుల్యం చేశారు. అగస్త్యముని బాధను ఉపశమింపజేసేలా పరమేశ్వరుడు పలు క్షేత్రాల్లో ఆయనకు తన తిరుకళ్యాణ వైభవాలను దర్శింపజేశారు. అలాగే ఇక్కడి గుహలో తపమాచరించిన అగస్త్యమహర్షికి కూడా ఆదిదంపతులు నూతన వధూవరులుగా దర్శనమిచ్చారు. కనుకనే ఈ గుహకు కైలాసగుహ' అనే పేరొచ్చింది. ఈ గుహలో భక్తులు పాకుకుంటూ వెళ్ళి స్వామివారిని దర్శించుకుంటారు. గుహలోపల ప్రాంతంలో ఇద్దరు మాత్రమే పూజ చేయడానికి వీలుంది. ఆ గుహ నుంచి నిరంతరం తీర్థజలాలు ఉబికి వస్తుంటాయి. ఆ గుహలోకి వెళ్ళి రావటమే అత్యుత్తమమైన యోగాసనం అని చెబుతారు. ఈ ప్రాంతంలోనే సర్ప గుహ, కృష్ణుడి గుహ, కన్యకల గుహ అంటూ పలు గుహలు వేర్వేరు తీర్థాలతో ఉన్నాయి. ఓంకార రూపంలో ఉన్న ఈ పర్వతంపై కన్యకలు నృత్యం చేసిన కాలి పాదాల రేఖలు కలిగిన ఓ పెద్ద బండరాయి కూడా ఉంది. ఆ రాతిపై కూర్చుని తపమాచరిసస్తే పాపాలన్నీ పోతాయని శైవాగమ పండితులు చెబుతున్నారు.





శిలగా దర్శనమిస్తున్న వృక్షం - ప్రత్యేక అలంకారంలో సురుళియప్పన్

ఎలా వెళ్లాలి?

తేని జిల్లా ఉత్తమపాళయం తాలూకా, కంభం పట్టణానికి సమీపంలో ఉందీ ఈ పర్వతాలయం. రాష్ట్రంలోని పలు జిల్లా కేంద్రాల నుంచి కంభం పట్టణానికి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ఆమ్నీ బస్సులు నడుపుతున్నారు. ఈ బస్సులలో కంభం పట్టణానికి చేరుకుంటే అక్కడి బస్టాండు నుండి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సురుళిమలై ప్రాంతానికి ఆటోలు, టాక్సీల్లో చేరుకోవచ్చు. తేని రైల్వేస్టేషన్‌కు 48 కి.మీ.ల దూరంలో ఈ ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 8 నుండి సాయంత్రం 4 వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఆలయవైభవం..

సురుళిమలైలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన గుహాలయంలో స్వామివారు భక్తులను అనుగ్రహిస్తున్నారు. స్వామివారి పక్కనే వినాయకుడు, మహాలింగం, సంతాన కృష్ణుడు, వీరబాహుడు, శ్రీరాముడు, లక్ష్మణుడి విగ్రహాలున్నాయి. ఈ కొండపై ఎంతోమంది సిద్ధపురుషులు నివసిస్తున్నారని భక్తులు చెబుతారు. వేలప్పర్ గర్భాలయంలో పరమేశ్వరుడు, మహావిష్ణువు, వినాయకుడు భక్తులకు దర్శనమివ్వటం విశేషం.. ఈ పర్వతంపై సిద్ధపురుషులు ఇప్పటికీ సూక్ష్మరూపంలో తపమాచరిస్తుంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.





గుహాలయంలో దర్శనమిస్తున్న సురుళియప్పన్ స్వామి - పుణ్యతీర్థం మెట్లదారి

రావణుడిని తరిమికొట్టిన మహావిష్ణువు..

లంకేశ్వరుడైన రావణాసురుడు తన తపోమహిమచేత దేవతలను, మునులను చిత్రహింసలకు గురిచేశాడు. అతడి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని భావించిన దేవతలు, మునీశ్వరులు, సిద్ధపురుషులు ఇక్కడి కైలాసనాథుడి గుహలో మహావిష్ణువు అధ్యక్షతన సమావేశమయ్యారు. వీరినందరినీ సంహరించేందుకు రావణాసురుడు తన బలగంతో ఈ ప్రాంతానికి వచ్చాడు. ఆ విషయం తెలుసుకున్న మహావిష్ణువు పంచభూతాలుగా విశ్వమంతా వ్యాపించారు. మహావిష్ణువు రూపాన్ని చూసి భీతిల్లిన రావణాసురుడు, తన దళాలతో వెనుతిరిగాడు. ఇలా దేవతలు, సిద్ధపురుషులు, మహావిష్ణువు సమావేశమైన కైలాసగుహ మీదనే సురుళివేలప్పర్ స్వామివారి ఆలయం నిర్మితమై ఉంది.



శిరోభాగం లేని పరమేశ్వరుడి విగ్రహం

'బ్లడీ బెగ్గర్' ఓ డ్రామా థ్రిల్లర్

● దర్శకుడు శివబాలన్

యంగ్ హీరో కెవిన్ కథానాయకుడిగా తాను తెరకెక్కించిన 'బ్లడీ బెగ్గర్' చిత్రం డార్క్ కామెడీతో కూడిన డ్రామా థ్రిల్లర్ అని ఆ సినిమా దర్శకుడు శివబాలన్ ముత్తుకుమార్ అన్నారు. గురువారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో ఈ చిత్ర విశేషాలను ఆయన వివరించారు. 'ఇందులో హీరో ఆరంభం నుంచే 'బ్లడీ బెగ్గర్'గా ఉంటారు. ఆయన అలా ఎందుకున్నారనే అంశంతో స్టోరీ ప్రారంభమవుతుంది. ఈ చిత్రాన్ని చూసిన నిర్మాత నెల్సన్ కుమార్ మెచ్చుకున్నారు. నిజానికి ఈ చిత్రం నెల్సన్ ప్రొడ్యూస్ చేయాలన్న ఆలోచన లేదు. పలువురు నిర్మాతలను సంప్రదించిన తర్వాత స్క్రిప్టుపై ఉన్న నమ్మకంతో నిర్మాతగా ముందుకు వచ్చారు. స్వతహాగా దర్శకుడైన నెల్సన్ దిలీప్ కుమార్.. ఈ స్క్రిప్టులోనూ కొన్ని మార్పులు చేర్పులు చేశారు. కానీ, చిత్రీకరణలో ఎలాంటి జోక్యం చేసుకోలేదు. పూర్తి స్వేచ్ఛనిచ్చారు. తొలి షెడ్యూల్ మైసూరులో పూర్తి చేయగా, రెండో షెడ్యూల్ చెన్నైలో చిత్రీకరించాం. ఇందులో ప్రత్యేకంగా చెప్పుకునే రీతిలో హీరోయిన్ లేదు. కానీ, కథ డిమాండ్ మేరకు ఒక నటి ప్రధాన పాత్ర పోషించారు. బిచ్చగాడి వేషంలో కెవిన్‌ను ఐదారు విధాలుగా టెస్ట్ చేశాం. ఓ వేషంలోనే కెవిన్ రోడ్డుపై నిజంగానే భిక్షాటన చేయగా, ఎవరూ గుర్తుపట్టలేదు. పైగా ఓ మహిళ రూ.20 కూడా వేశారు. సో.. ఈ లుక్‌లో బెగ్గర్‌గా సరిగ్గా సరిపోయాడని భావించి దాన్నే ఖరారు చేశాం. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ప్రోమోకు మంచి స్పందన వచ్చింది. దర్శకుడుగా నా తొలి చిత్రం. దీపావళికి విడుదల చేస్తున్నాం' అని పేర్కొన్నారు.



'బ్లడీ బెగ్గర్'లో కెవిన్

నేడు తెరపైకి ఐదు చిత్రాలు



'ఆలన్'లో వెట్రి

ఈ శుక్రవారం ఐదు చిత్రాలు విడుదలవుతున్నాయి. ఈ నెల 10వ తేదీ గురువారం సూపర్‌స్టార్ నటించిన 'వేట్టయన్' చిత్రం విడుదల కాగా, 11వ తేదీన జీవా నటించిన 'బ్లాక్' చిత్రం విడుదలై విజయం సాధించాయి. 'వేట్టయన్' భారీ బడ్జెట్ చిత్రం కావడంతో చిన్న నిర్మాతలు తమ చిత్రాలను రిలీజ్ చేసేందుకు ఎవరూ సాహసం చేయలేదు. ఈ క్రమంలో మూడో శుక్రవారమైన నేడు ఐదు చిత్రాలు విడుదలవుతున్నాయి. వీటిలో 'ఆలన్', 'ఆర్యమాల', 'కరుప్పుపెట్టి', 'రాకెట్ డ్రైవర్', 'సార్' వంటి చిత్రాలున్నాయి. వీటిలో ఏ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారో వేచి చూడాల్సివుంది. ఆ తర్వాత దీపావళి పండుగను పురస్కరించుకుని, ఈ నెల 30వ తేదీన శివకార్తికేయన్ 'అమరన్', కవిన్ 'బ్లడీబెగ్గర్', జయం రవి 'బ్రదర్'తో పాటు మరికొన్ని సినిమాలున్నాయి. వచ్చే నెలలో సూర్య నటించిన 'కంగువా' చిత్రం పదికిపైగా భాషల్లో రిలీజ్‌కానుంది.



'సార్'లో విమల్

చిత్రజ్యోతి

ఐశ్వర్య లక్ష్మికి
టాలీవుడ్ ఆఫర్

'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో పూంగొళి పాత్రలో నటించి మెప్పించిన ఐశ్వర్య లక్ష్మికి తెలుగు చిత్రాల్లో నటించే అవకాశాలు వస్తున్నాయి. విష్ణు విశాల్ 'మట్టికుస్తీ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన ఐశ్వర్య హీరో సాయి తేజ్ నటించే చిత్రంలో హీరోయిన్‌గా ఎంపికయ్యారు. పీరియాడిక్ యాక్షన్ జోనర్‌లో ఈ సినిమాను తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో రూపొందించనున్నారు. కాగా, 'జగమే తందిరం' చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన ఐశ్వర్య లక్ష్మి.. ఆ తర్వాత 'గార్గి', 'కెప్టెన్', 'గట్టాకుస్తి' తదితర వంటి చిత్రాల్లో నటించారు. తెలుగులో కూడా ఒకటి రెండు చిత్రాల్లో చిన్నచిన్న పాత్రలను ధరించారు. ఇపుడే ఏకంగా హీరోయిన్ అవకాశాన్ని దక్కించుకోవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రజనీ - మణిరత్నం కలయికపై
సుహాసిని ఏమన్నారు?

సూపర్‌స్టార్ రజనీకాంత్ - దర్శక దిగ్గజం మణిరత్నం కాంబినేషన్ మరోమారు రిపీట్ కానుందనే వార్తలు చిత్రసీమలో చక్కర్లు కొడుతున్నాయి. వీటిపై మణిరత్నం సతీమణి, సినీ నటి సుహాసిని స్పందించారు. తాజాగా నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ, 'ఇప్పటివరకు రజనీకాంత్ - మణిరత్నం కాంబినేషన్ గురించి ఎలాంటి చర్చలు జరగలేదు. మీడియాలో వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలు మాత్రమే. అలాంటి ముఖ్య సమాచారం ఏదైనా ఉంటే ఖచ్చితంగా మీడియాకు తెలియజేస్తాం' అని బదులిచ్చారు. కాగా, వీరిద్దరి కాంబినేషనలో గత 1991లో 'దళపతి' చిత్రం వచ్చింది. మెగా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ఈ చిత్రం తర్వాత వీరిద్దరు కలిసి పనిచేయలేదు. దీంతో రజనీకాంత్ - మణిరత్నం కాంబోలో ఒక చిత్రం తెరకెక్కనుందనే ప్రచారం కోలీవుడ్‌లో జోరుగా సాగుతుండగా, దీనికి సుహాసిని ఫుల్‌స్టాప్ పెట్టారు.



ఫెస్టివల్ సీజన్‌లో ఆకట్టుకునేలా 'ఉమ్మిడి' ప్రచారం

అడయార్, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి) పండగ సీజన్‌లో కొనుగోలుదారలను ఆకట్టుకునే విధంగా దేశంలో విశ్వసనీయ వారసత్వ ఆభరణాల బ్రాండ్‌గా గుర్తింపు పొందిన ఉమ్మిడి జ్యూవెలర్స్ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఈ బంగారు ఆభరణ సంస్థకు చెందిన ఉత్తమమైన వాటిని ప్రదర్శించేందుకు వీలుగా సృజనాత్మకమైన, ఆకర్షణీయమైన వీడియోలతో ప్రచారం మొదలుపెట్టింది. ఈ ప్రచారానికి సంబంధించిన మరిన్ని వివరాలను ఉమ్మిడి జ్యూవెలర్స్ మేనేజింగ్ పార్టనర్ అమరేంద్రన్ ఉమ్మిడి మాట్లాడుతూ, 'ఈ ప్రచారం పండగ రోజుల్లో ఉమ్మిడి బంగారు జ్యూవెలర్స్ ఆభరణాలను విశ్వసించే నమ్మకమైన తమ కస్టమర్ల కోసం అంకితమన్నారు. కస్టమర్ల ఇళ్ళలో జరిగే ప్రతి వేడుకలో భాగం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. తమ ఆభరణాల్లో నాణ్యతతో పాటు సంప్రదాయానికి పెద్దపీట వేసి, అద్భుతమైన హస్తకళతో తయారు చేసినట్టు తెలిపారు. వీటి ప్రచారం కోసం ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికల్లో వినూత్న ప్రచారాన్ని ప్రారంభించినట్టు పేర్కొన్నారు.



కన్నియాకుమారిలో రెండోరోజూ 'అల'జడి

● బోట్ సవారీ రద్దు

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో రెండో రోజు సముద్రతీరంలో అలలు తీరం వైపు ఎగసిపడ్డాయి. సునామీ తర్వాత ఇక్కడి తీరంలో అమావాస్య, పౌర్ణమి రోజుల్లో సముద్రనీటి మట్టం తగ్గటం, పెరగటం జరుగుతూ ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తీరం పొడవునా రాక్షస అలలు దూసుకువచ్చి జనావాస ప్రాంతాల్లోకి చొరబడ్డాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కూడా 15 అడుగుల ఎత్తున తీరం నుండి 50 అడుగుల వరకు అలలు దూసుకువచ్చాయి. దీంతో త్రివేణి సంగమం, సంగిలితురై ప్రాంతాల్లో సముద్రం వెనక్కి మళ్ళింది. తిరువళ్లువర్ విగ్రహం ప్రాంతం వద్ద కూడా అలలు ఎగసిపడ్డాయి. ఉదయం ఎనిమిది గంటల తర్వాత కూడా అలజడి తగ్గకపోవడంతో వివేకానంద స్మారక మండప ప్రాంతాని బోట్ సవారీని పూంపుహార్ సంస్థ రద్దు చేసింది. చిన్నముట్టం, వావత్తురై, కోవళం, కీళ్‌మనక్కుడి, మనక్కుడి వంటి తీర ప్రాంత గ్రామలలోనూ అలల తాకిడి అధికంగా కనిపించింది.



తిరువళ్లువర్ విగ్రహం ప్రాంతంలో ఎగసిపడుతున్న అలలు

సాత్తనూరు డ్యామ్‌కు జలకళ

● వందడుగులకు పెరిగిన నీటిమట్టం

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా సాత్తనూరు డ్యామ్‌లో గురువారం మధ్యాహ్నానికల్లా నీటి మట్టం వందడుగులకు పెరిగింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా దక్షిణ పెన్నారు పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల కృష్ణగిరి డ్యామ్ నుండి జలాలను విడుదల చేస్తున్నారు. దీంతో దక్షిణ పెన్నారులో వరద కారణంగా తిరువణ్ణామలై జిల్లా తండరాంబట్టు సమీపంలో ఉన్న సాత్తనూరు డ్యామ్‌లోకి జలాలు ప్రవేశించాయి. దీంతో ఐదు రోజుల వ్యవధిలో 4 అడుగుల దాకా నీటిమట్టం క్రమంగా పెరిగింది. గురువారం మధ్యాహ్నానికి ఆ డ్యామ్ నీటి మట్టం వందడుగులకు చేరింది. ఆ డ్యామ్‌లో 119 అడుగుల వరకు జలాలను నిల్వచేసే వీలుంది.



ఇండియన్ ఆర్థోపెడిక్ సొసైటీ అధ్యక్షురాలిగా డాక్టర్ శ్రీదేవి



అడయార్, అక్టోబరు 17:(ఆంధ్రజ్యోతి) శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎస్‌ఆర్‌ఐహెచ్‌ఈఆర్)లోని ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్, అసిసోయేట్ డీన్ (రీసెర్చ్) డాక్టర్ శ్రీదేవి పద్మనాభన్ ఇండియన్ ఆర్థోపెడిక్ సొసైటీ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. 1965లో నెలకొల్పిన ఈ సొసైటీలో దాదాపు పది వేల మందికిపైగా లైఫ్‌టైమ్ మెంబర్స్, విద్యార్థులు సభ్యులుగా ఉన్నారు. ఎముకలకు సంబంధించిన అనేక పరిశోధనాత్మక అంశాల్లో ఈ సొసైటీ కీలక భూమిక పోషిస్తుంది. అలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు డాక్టర్ శ్రీదేవి అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈమె గతంలో జర్నల్ ఆఫ్ ఇండియన్ ఆర్థోడొంటిక్ సొసైటీకి 2014-18 మధ్య కాలంలో సంపాదకురాలిగా పనిచేశారు. అలాగే, 2018-24 మధ్య కాలంలో కార్యదర్శిగా ఉన్నారు. ప్రస్తుతం అధ్యక్ష పదవిలో ఆమె 2025 నుంచి 2026 వరకు కొనసాగుతారు.

హెవీ డ్యూటీ ఎలక్ట్రిక్ టిప్పర్‌కు 'మోమోలోగేషన్ సర్టిఫికెట్'

అడయార్, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి) ప్రొపెల్ ఇండస్ట్రీస్‌కు చెందిన 470 హెచ్‌ఈవీ - హెవీ డ్యూటీ ఎలక్ట్రిక్ టిప్పర్‌కు హోమోలోగేషన్ సర్టిఫికెట్ లభించింది. దేశంలోనే తొలి ఎలక్ట్రిక్ టిప్పర్‌గా గుర్తింపు పొందిన ఈ వాహనం పనితీరు, పర్యావరణ నిర్వహణ వంటి అంశాల్లో కొత్త బెంచ్ మార్క్‌లకు ఇది కొలమానం వంటిది. దీంతో ఈ వాహనానికి హోమోలోగేషన్ సర్టిఫికెట్ లభించింది. ఈ వాహనం రవాణాకు, ప్రభుత్వ భద్రతా ప్రమాణాలకు ఎంతో అనువుగా ఉందని ఈ ధృవపత్రం నిర్ధారించింది. ఈ మైలురాయిపై ప్రొపెల్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ వి.సెంథిల్ కమార్ మాట్లాడుతూ, ఈ తరహా వాహనాన్ని ప్రారంభంలో ఆఫ్-రోడ్ అప్లికేషన్ల కోసం తయారు చేయగా, దీనికి హోమోలోగేషన్ సర్టిఫికెట్ రావడం ఒక అద్భుతమైన విజయమన్నారు. ఇది తమ కంపెనీ అభివృద్ధికి, నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. దేశంలోని మైనింగ్, నిర్మాణ రంగానికి ఎలక్ట్రిక్ మొబిలిటీలో ఈ సర్టిఫికెట్ ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

'ఆన్‌లైన్ రియల్ మనీ గ్రేమ్స్' ఫ్రేమ్ వర్క్ రూపకల్పన

అడయార్, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి) శాస్త్రీయ, డేటా ఆధారిత విధానంలో ఆన్‌లైన్ గేమ్‌లను నైపుణ్యం ఆధారంగా వర్గీకరించడానికి వీలుగా దేశంలో తొలిసారిగా 'ఆన్‌లైన్ రియల్ మనీ గేమ్స్' ఫ్రేమ్‌వర్క్‌ను ప్రఖ్యాత గణాంక నిపుణుడు ప్రొఫెసర్ బిమల్ రాయ్ ఆవిష్కరించారు. ఇందుకోసం ఆయన ది డైలాగ్ అనే సంస్థ సహకారం కూడా తీసుకున్నారు. దేశంలో నానాటికీ విజృంభిస్తున్న ఆన్‌లైన్ గేమింగ్ మార్కెట్‌ను నియంత్రించడంలో ఒక ముఖ్యమైన దశను చూస్తోంది. ఇది ఒక సంచలనాత్మక చొరవగా నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఫ్రేమ్‌వర్క్ శాస్త్రీయ కఠినతర, అత్యున్నత ప్రమాణాలకు అనుగుణంగా ఉంది. ఇదిలావుంటే, నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్ మాజీ ఛైర్మన్‌గాను, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌కు మాజీ డైరెక్టరుగా సేవలందించిన ప్రొఫెసర్ బిమల్ రాయ్‌ను కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సన్మానించింది.

మెరీనాబీచ్ నేపియర్ వంతెన వద్ద కూవం ముఖద్వార ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్





బైకు హోటల్

టమోటా రైస్, వెజ్ పలావ్, చపాతీ, పులిహోర రైస్, లెమన్ రైస్.. ఇలా స్కూటర్‌కు ప్లకార్డులు కట్టారు. ఫుట్‌పాత్‌పై స్టాండు పెట్టి ఇంటి నుంచి తీసుకొచ్చిన హాట్‌బాక్సు, గిన్నెలు సర్ది పెట్టారు. ఎండ, వానకు రక్షణకు పెద్ద గొడుగు ఉంచారు. అంతే.. రోడ్‌సైడ్ హోటల్ రెడీ. ఇంటి నుంచి తీసుకొచ్చిన ఆహార పదార్థాలు అయిపోగానే.. తిరిగి ఇంటికి వెళ్లి పోతారు. ఇలా గురువారం తిరుపతి నగరం కపిలతీర్థం రోడ్డులో స్కూటర్ హోటల్ కనిపించింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మందు కోసం..

జగన్ ఐదేళ్ల పాలనలో నాణ్యమైన మద్యానికి దూరమయ్యారు మందుబాబులు. ధర ఎక్కువైనా, నాసిరకం 'జే' బ్రాండ్లే దిక్కయ్యాయి. బుధవారం సాయంత్రం ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కాగానే.. తమకు కావాల్సిన బ్రాండ్ల కోసం బారులు తీరారు. గురువారం కూడా పలు మద్యం షాపుల వద్ద మందుబాబుల సందడి కనిపించిది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి





తిరుమల ఆలయంలోకి మహాద్వారం గుండా ప్రవేశించగానే కుడివైపున ఉండే శ్రీకృష్ణదేవరాయలు, తిరుమలదేవి, చిన్నాదేవి విగ్రహాలు

■ నేడు శ్రీకృష్ణదేవరాయలు 459వ వర్ధంతి

వెంకన్న వీరభక్తుడు దేవరాయలు



తిరుమల ఆలయం ఉత్తరపు గోడమీద శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ.1513లో తెలుగులో వేయించిన శాసనం. తిరుమలదేవి, చిన్నాదేవిలు స్వామికి బంగారపు నైవేద్యపు పాత్రలు సమర్పించినట్లు ఇందులో పేర్కొన్నారు.

తిరుమల ఆలయానికి గొప్ప వైభవం రావడంలో విజయనగర రాజుల పాత్ర కీలకమైనది. వీరిలో శ్రీకృష్ణదేవరాయలు తిరుమల శ్రీవేంకటేశ్వరుడికి వీరభక్తుడు. తన 21 ఏళ్ల పాలనా కాలంలో ఆయన ఏడుసార్లు తిరుమలను సందర్శించారు. అనేక దానాలు చేశారు. స్వామికి విలువైన ఆభరణాలు చేయించి ఇచ్చారు. అందుకే తిరుమల ఆలయంలో ముకుళిత హస్తాలతో ఉన్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఉంటుంది. ఆయనకు అటూ ఇటూ ఇద్దరు భార్యల విగ్రహాలుంటాయి. ఆయన వెంకన్నకి ఎంత భక్తుడంటే.. భార్యల్లో ఒకరి పేరు తిరుమల దేవి. కూతురికి తిరుమలాంబ అని, కుమారుడికి తిరుమల దేవరాయలు అని ఆయన పేర్లు పెట్టుకున్నారు. చిన్నల్లుడి పేరు కూడా తిరుమల రాయలు కావడం విశేషం. కృష్ణదేవరాయలు వేయించిన శాసనాల ద్వారా తిరుమల వైభవ విశేషాలు అనేక తెలుస్తాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఏడుసార్లు తిరుమలకు వచ్చిన కృష్ణదేవరాయులు

- 1513 ఫిబ్రవరి 10వ తేదిన మొదటిసారిగా దేవరాయులు తిరుమలకు వచ్చారు. నవరత్న ఖచిత కిరీటాన్ని స్వామికి సమర్పించారు.
- 1513 మే 2న తిరుమలకు వచ్చిన ఆయన శ్రీవారికి పాలు నైవేద్యంగా సమర్పించటానికి 374 తులాల బంగారు గిన్నె ఇచ్చారు. ఉత్సవమూర్తులకు మూడు బంగారు కిరీటాలు ఇచ్చారు.
- 1513 జూన్ 13న శ్రీవారిని దర్శించుకున్న ఆయన నిత్యసేవల కోసం మాన్యాలు రాసిచ్చారు. నవరత్న ఖచిత ఆభరణాలు సమర్పించారు.
- 1513జూలై 6న స్వామిని దర్శించుకున్న శ్రీకృష్ణ దేవ రాయలు 30 వేల బంగారు నాణేలతో అభిషేకం చేశారు. పలు బంగారు కానుకలను ఇచ్చారు.
- 1515 అక్టోబరు 25న తిరుమలకు వచ్చిన ఆయన మకరతోరణం సమర్పించారు.
- 1517 జనవరి 2న ఆనందనిలయానికి బంగారు పూత పూర్తి అయిన సందర్భంగా కూడా శ్రీకృష్ణ దేవరాయలు తిరుమలకు వచ్చారు.
- 1521 ఫిబ్రవరి 17న తిరుమలకు వచ్చిన ఆయన పీతాంబరంతో పాటు అత్యంత విలువైన వజ్రాలు, ఇతర బంగారు ఆభరణాలు సమర్పించుకున్నారు.

విశేషం

శ్రీకృష్ణదేవరాయలు సమర్పించిన బంగారు పాత్రలూ, ఆభరణాల జాబితా అయితే శాసనాల ఆధారంగా లభించింది కానీ, ఆభరణాలు ఒక్కటి కూడా ప్రస్తుతం లేవు. 1952లో టీటీడీ ఆధ్వర్యంలోకి వచ్చిన ఆభరణాలలో వీటి జాడ లేదు. అప్పటికే మాయమయ్యాయి. కరిగించి కొత్త ఆభరణాలు చేయించి ఉండవచ్చని ఒక ఊహ.

'జల'జలమంటూ..



సదాశివకోన



అమ్మవారికోన

సదాశివకోనలో జలపాత సోయగం

వడమాలపేట మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న సదాశివకోన, అమ్మవారి కోనల జలపాతాల సోయగం పర్యాటకులను అలరిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉధృతంగా నీళ్ల జాలువారుతున్నాయి.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి

కనువిందు చేస్తున్న ఉబ్బలమడుగు

వరదయ్యపాళెం మండలంలోని ఉబ్బలమడుగు జలపాతం కనువిందు చేస్తోంది. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు అడవిలో నుంచి ముందుకు సాగుతున్న ప్రవాహం.. చూపరులను ఆకట్టుకుంటోంది.

- వరదయ్యపాళెం, ఆంధ్రజ్యోతి





ఉధృతంగా కైలాసనాథ కోన

నారాయణవనం మండల పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతంలో కామాక్షి దేవి సమేత కైలాసనాథ స్వామి కొలువై ఉన్నారు. అక్కడి కైలాసనాథ కోనలో ప్రస్తుతం వర్షాల కారణంగా జలపాతం ఉధృతంగా పడుతోంది. దీంతో భక్తుల రాకపోకలను నిషేధించారు. ప్రకృతి సోయగాల నడుమ, పెద్ద వృక్షాల మధ్య జలపాతం అత్యంత శోభాయామానంగా ఉంది. కొందరు భక్తులు ఇక్కడకు వచ్చి స్నానాలను ఆచరించి అయ్యప్పమాల ధరిస్తున్నారు.

- నారాయణవనం, ఆంధ్రజ్యోతి

సందడి.. సందడిగా

మూడు రోజులుగా తిరుమల కొండల్లో కురిసిన వర్షానికి జలధారలు పరుగులు తీస్తున్నాయి. తిరుపతిలోని కపిలతీర్థంలోకి జలపాతం ఉరుకుతోంది. ఈ నీటి సోయగాలను చూసేందుకు స్థానికులు, భక్తులు గురువారం తరలివచ్చారు. ఫొటోలు, సెల్ఫీలతో సందడి చేశారు.

- తిరుపతి(కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి



ఉరుకుతున్న తలకోన



శేషాచలంలోని తలకోన జలపాతాలు ఆహ్లాదం పంచుతున్నాయి. కొండల నుంచి ఉవ్వెత్తున కిందికి ఉరుకుతున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ దట్టమైన అటవీప్రాంతంలో భారీగా నీరు చేరింది. తలకోన సముద్ర మట్టానికి సుమారు 700 అడుగు ఎత్తున ఉంది. దీంతో ఇక్కడి పర్వత శ్రేణుల శిఖరాల నుంచి వర్షపు నీరు ఉధృతంగా కిందకు చేరుతున్న తీరు మానసిక ఉల్లాసం కలిగిస్తోంది. భద్రత దృష్ట్యా ప్రస్తుతం ఇక్కడకు భక్తులను అనుమతించడంలేదు.

- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి





శ్రీవారికి పున్నమి గరుడసేవ

తిరుమలలో గురువారం పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 8వ తేదీన గరుడవాహనమెక్కి దర్శనమిచ్చిన శ్రీవారు పౌర్ణమి సందర్భంగా మరోసారి విశేష అలంకరణలో తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై కొలువుదీరారు. ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల కర్పూర నీరాజనాలు, గోవిందనామ స్మరణల మధ్య గరుడోత్సవం కన్నుల పండువగా జరిగింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ప్రత్యేక అలంకరణలో కనువిందు చేస్తున్న శ్రీపద్మావతీ అమ్మవారు



టి.నగర్ జీఎన్‌చెట్టి రోడ్డులోని పద్మావతి తాయార్ ఆలయంలో వార్షిక పవిత్రోత్సవం ముగింపు సందర్భంగా గురువారం చక్రస్నానం నిర్వహించడానికి వెళుతున్న ఆలయ అర్చకులు, వైష్ణవ పండితులు.

శ్రీవారిసేవలో నటి రాశి

తిరుమల శ్రీవారిని గురువారం సినీ నటి రాశి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆమె ఉదయం వీఐపీ బ్రేక్‌లో స్వామి సేవలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



కేబినెట్ నిర్ణయానికి గవర్నర్ కట్టుబడి ఉండాల్సిందే

- మద్రాసు హైకోర్టు

చెన్నై, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ కేసులో యావజ్జీవఖైదీగా పుళల్ కేంద్ర కారాగారంలో ఉన్న వీరభారతి, తనను ముందుగానే విడుదల చేసేలా ఉత్తర్వులు జారీచేయాలంటూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. తనను ముందుగానే విడుదల చేయాలన్న ప్రభుత్వ సిఫారసును గవర్నర్ నిరాకరించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. గురువారం ఈ కేసు విచారించిన న్యాయస్థానం, మంత్రివర్గ నిర్ణయానికి గవర్నర్ కట్టుబడి ఉండాల్సిందేనని, గవర్నర్ దానిని ఉల్లంఘించలేరన్న సుప్రీంకోర్టు తీర్పును గుర్తు చేస్తూ.. పిటిషనర్ దరఖాస్తును పునః పరిశీలించాలని ప్రభుత్వానికి సూచించింది.

మూడు నెలల్లో అన్ని బస్సుల్లో ఈ టిక్కెట్ మిషన్లు

వేళచ్చేరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాబోయే మూడు నెలల్లో రాష్ట్ర రవాణా నడుపుతున్న సాధారణ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో ఈ టిక్కెట్ మిషన్లు ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర రవాణా సంస్థ పరిధిలో విల్లుపురం, కోవై, సేలం, కుంభకోణం సహా 8 ప్రాంతీయ మండలాల పరిధిలోని 22 డిపోల ద్వారా 1,078 బస్సులు నడుపుతున్నారు. 2010-11 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వ బస్సుల్లో ఎలక్ట్రానిక్ యంత్రం ద్వారా టిక్కెట్లు అందించే ప్రక్రియను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. అనంతరం ఎస్బీఐతో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా ప్రస్తుతం నగరాల్లో నడుపుతున్న సిటీ బస్సుల్లో ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో అమలుచేశారు. కాగా, మూడు నెలల్లో ఈ విధానాన్ని అన్ని బస్సులకు ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు తెలిపారు.



కడలూరులోని అన్నామలై విశ్వవిద్యాలయంలో గురువారం ఉదయం జరిగిన 86వ స్నాతకోత్సవంలో ఓ విద్యార్థినికి పట్టాను ప్రదానం చేస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి